ఆలయాల్లో కుంకుమ పూజలు



సీతానగరం: లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో భక్తులతో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు శ్రీనివాసాచార్యులు



సాలూరు: ప్రత్యేకాలంకరణలో సరస్వతి దేవి

సీతానగరం: శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా లోక ల్యాణార్థం పర్వదినానాన్ని పురస్కరించుకుని మండలంలోని ఆలయాల్లో మహిళలు శుక్రవారం కుంకుమ పూజలు నిర్వహించి ముత్తైదువులకు తాంబూలాలు సమర్పించారు. అలాగే వివిధ ఆలయాల్లో పసుపు, కుంకుమ మూడు రకాల పండ్లు, మూడు రకాల వంటకాలు, గాజులు జాకెట్ ముక్కలు అమ్మవారికి సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ మేరకు మండలకేంద్రంలోని వేణుగోపాల స్వామి, లక్ష్మీనృసింహ స్వామి ఆలయాల్లో ఆలయ ప్రధాన అర్చకుడు పీసపాటి శ్రీనివాసాచార్యులు వందలాది మంది మహిళా భక్తులతో అమ్మవారికి కుంకుమ పూజలు చేయించారు. అలాగే కాశీపేట,



పార్వతీపురం: అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

జానుమల్లువలస, బీకే పురం, గుచ్చిమి, సూరంపేట, కేఎస్ పురం గ్రామాల్లోని ఆలయాల్లో అర్చకులు కుంకుమ పూజలు చేయించారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం

పార్వతీపురంటౌన్: శ్రావణ మాసంలో రెండవ శుక్రవారాన్ని పురస్కరించుకుని పార్వతీపురం పట్టణంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. మండలంలోని అన్ని ప్రధాన ఆలయాలు తెల్లవారు జాము నుంచే భక్తులతో నిండిపోయాయి. పార్వతీదేవి ఆలయంతో పాటు పలు ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

సాలూరులో..

సాలూరు: పట్టణం, మండలంలో శ్రావణ శుక్రవారం పూజలను మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ మేరకు స్థానిక అమ్మవార్ల ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని కన్యకాపరమేశ్వరి, కామాక్షమ్మ తదితర ఆలయాల్లో విశేష పూజలు చేశారు. ఈ నేపథ్యంలో స్థానికంగా ఆధ్యాత్మికతతో కూడిన సందడి వాతావరణం నెలకొంది.

పార్వతీపురం మండలంలో..

పార్వతీపురం: మండలంలోని సంగంవలస గ్రామంలో గల కోటదుర్గమ్మ ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. శ్రావణమాసం సందర్భంగా అమ్మవారికి మహిళలంతా సామూహిక కుంకుమ పూజ చేశారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో గల అమ్మవారి ఆలయాల్లో కుంకుమ పూజలు జరిగాయి. ఆయా గ్రామాల్లో మహిళలు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.



సాలూరు: కామాక్షమ్మ ఆలయంలో ఏకామ్రనాథ స్వామికి ప్రత్యేక అలంకరణ



పార్వతీపురం టౌన్: వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు



పార్వతీపురం టౌన్: పార్వతీదేవి ఆలయంలో పూజలు

క్లుప్తంగా

లప్పటిలో ఉచిత వైద్యశిబిరం



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ రవికుమార్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని లుంబేసు పంచాయతీ లప్పటి గ్రామంలో శుక్రవారం రాఫ ఫౌండేషన్, మధుశ్రీ హెల్త్‌కేర్ సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా మధుశ్రీ హెల్త్‌కేర్(క్లినిక్) డాక్టర్ రవికుమార్ సీజనల్ వ్యాధులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్‌గా వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వైద్య సేవలందించాలనే ఉద్దేశంతో శిబిరాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాఫ ఫౌండేషన్ ప్రతినిధులు ఎం.శోభన్‌బాబు, జి.పెంటయ్య ఉన్నారు.

అటవీ భూములకు రక్షణ కల్పించాలని వినతి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వ అటవీ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలని ఏపీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మండంగి రమణ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన ఎల్విన్‌పేట, జేకేపాడు, ఎస్‌కేపాడు తదితర గ్రామాలకు చెందిన గిరిజనులతో కలిసి శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ రాజేంద్రకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రగిరిలోని గురుకుల బాలుర కళాశాల సమీపంలోని ప్రభుత్వ అటవీ భూములను ప్రభుత్వం వన సంరక్షణ సమితికి అప్పగించిందన్నారు. ఆ స్థలం అన్యాక్రాంతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని, అటవీ భూములకు రక్షణ కల్పించాలని కోరారు.

నేత్రదానంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నగేష్‌రెడ్డి

కురుపాం: ప్రతీ ఒక్కరు నేత్రదానం చేసేందుకు ముందుకు రావాలని జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్యాధికారి జీరు నగేష్‌రెడ్డి అన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల అవగాహనలో భాగంగా శుక్రవారం కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రంలో నేత్రదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శరీరంలో ఏ అవయవానికి బాధ కలిగించినా ఆ బాధను కళ్లే వ్యక్త పరుస్తాయని, సర్వేంద్రియానాం నయనం ప్రధానం అని తెలుసుకోవాలన్నారు. ఈ నెల 25 నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు జరుగు జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. నేత్రదానం ఎలా చేయాలి.. ఎవరిని సంప్రదించాలి తదితర అంశాలపై అవగాహణ కల్పించారు. అలాగే పలువురికి నేత్ర పరీక్షలు చేసి కళ్లద్దాలకు సిఫార్స్ చేశారు.

రక్తహీనత నివారణకు ముందుజాగ్రత్త చర్యలు



రోగులను తనిఖీ చేస్తున్న డాక్టర్ ఉషారాణి

సీతానగరం: ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలులో భాగంగా గ్రామాల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలందించడానికి వైద్యారోగ్యశాఖను ప్రజలు వినియోగించు కోవాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ ఉషారాణి అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని అప్పయ్యపేటలో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ విధానంతో సచివాలయ కన్వీనర్ బి.సూర్యనారాయణ ఫ్యామిలీ డాక్టర్ వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సహకారంతో గ్రామాల్లో రోగులకు ప్రభుత్వ వైద్యసేవలు అందించడానికి తమవంతు కృషి చేస్తామన్నారు. గ్రామాలకు వస్తున్న 104 సంచార వైద్యకేంద్రంలో రోగులకు వైద్య పరీక్షలు చేసి వ్యాధులను నిర్ధారించి, రోగ నివారణకు అవసరమైన మందులను సమకూర్చాలని కోరారు. పిల్లలు, గర్భిణులు, కిశోరీ బాలికల్లో రక్తహీనత నివారణకు పౌష్టికాహారం అందివ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ ఆశ యాప్‌లో ఆరోగ్య సేవల నమోదు ప్రక్రియ, గ్రామాల్లో గర్భనిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉండేలా, ఎన్విడా సర్వే కుటుంబ సంక్షేమ పద్ధతులు తదితర అంశాలపై ఆరా తీశారు.

అప్పయ్యపేటలో..

అప్పయ్యపేటలో పీహెచ్‌సీ డాక్టర్ ఉషారాణి నేతృత్వంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సచివాలయ కన్వీనర్ బి.సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రజల సహకారంతో గ్రామాల్లో రోగులకు ప్రభుత్వ వైద్యసేవలు అందించడానికి తమవంతు కృషి చేస్తామన్నారు.

■ స్వాగతం.. సుస్వాగతం...









కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం శంకుస్థాపన కార్యక్రమానికి విజయనగరం జిల్లాకు వచ్చిన కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు, ఏపీ టిడ్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్, ఎస్టీ కమిషన్ రాష్ట్ర ఛైర్మన్ డీవీజీ శంకరరావు, పాచిపెంట ఎంపీపీ బడ్నాన ప్రమీల

దోమల నివారణ మందు పిచికారీ చేయాలి



దోమల నివారణమందు పిచికారీని పరిశీలిస్తున్న అధికారులు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో దోమల నివారణకు ప్రజలు సామూహికంగా దోమలనివారణ మందును పిచికారీ చేయాలని ఎంపీడీఓ ఎంఎల్ఎస్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని అంటిపేట పంచాయతీలో సర్పంచ్ తిరుపతిరావు ఆధ్వర్యంలో కార్యదర్శి శశిభూషణరావు దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీఓ ఎంఎల్ఎస్ ప్రసాద్‌తో పాటు సీతానగరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ శిరీష, ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ప్రసాద్ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న కారణంగా ప్రజలు తడిసి జ్వరాల బారిన పడే అవకాశం ఉందన్నారు. అలాగే వీధుల్లో ఇళ్లను చెత్త తెచ్చివేయడం వల్ల దోమలు వస్తాయని, దోమల నివారణ సామాజిక బాధ్యతగా గుర్తించి చెత్తను దూర ప్రాంతాల్లో వేయాలని, కాలువల్లో నీరు నిల్వలేకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వైద్యాధికారి శిరీష మాట్లాడుతూ పీహెచ్‌సీల్లో అన్నిరకాల వ్యాధుల నివారణకు మందులున్నాయని, ప్రభుత్వ వైద్యం గ్రామాల్లో అందుబాటులో ఉందని ప్రజలు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈఓపీఆర్డీ కుమారవర్మ మాట్లాడుతూ గ్రామాల్లోని పారిశుద్ధ్య పనులు చేయించడంతో పాటు, తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలని, పారిశుద్ధ్య పనులు చేయించాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్బీకేల్లోనే పశువుల మందులు

సీతానగరం:



రైతుభరోసా కేంద్రంలో మందులను తనిఖీ చేస్తున్న పశుసవర్థక డీడీ డాక్టర్ రెడ్డి నీలయ్య

గ్రామాల్లోనే పశువులకు మెరుగైన వైద్య సేవలందించడానికి అవసరమైన మందులు రైతు భరోసా కేంద్రాలకు ప్రభుత్వం సరఫరా చేసిందని బొబ్బిలి పశుసంవర్థక శాఖ డీడీ డాక్టర్ రెడ్డి నీలయ్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సీతానగరం సబ్‌డివిజన్ ఎ.డి డాక్టర్ సీహెచ్‌దీనకుమార్‌తో కలిసి బొబ్బిలి డివిజన్‌లోని తుమరాడ రైతు భరోసా కేంద్రంలో మందులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువుల ఆరోగ్య పరిరక్షణ, అత్యవసర వైద్య సేవలందించడానికి రైతు భరోసా కేంద్రాల్లోనే మందులు సమృద్ధిగా నిలవ్వలున్నాయని తెలియజేశారు. అన్నిరకాల వ్యాధుల నివారణకు అవసరమైన మందులు ఉన్నందున అక్కడి వైద్యులు వైద్య సేవలందించాలని కోరారు. పశువుల్లో వచ్చే వ్యాధుల నివారణకు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా వైద్యాధికారులు, సిబ్బంది సహకారంతో సీజనల్‌గా వచ్చే అంటు వ్యాధుల నివారణకు గాలి కుంటువ్యాధి, జబ్బవాపు వ్యాధి, గొంతువాపు, చిటిక వ్యాధి, బ్రూసెల్లా వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు తెలిపారు.

రారవే సమావేశం రేపు

రాజాం సిటీ: ఈ నెల 27న స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో రాజాం రచయితల వేదిక 103వ సమావేశం నిర్వహించనున్నామని వేదిక నిర్వాహకులు గార రంగనాథం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో 'వావిలవలస జమీందారీ నాడు–నేడు' అనే అంశంపై ప్రసంగించనున్నట్లు చెప్పారు. సమావేశానికి రచయితలు, భాషాభిమానులు, కవులు, సాహిత్యాభిమానులు హాజరుకావాలని కోరారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం

వంగర: స్థానిక ఎస్‌బీఐలో వివిధ హోదాల్లో పని చేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉద్యోగులు పారసాన హరిబాబు, బి.అచ్చెంనాయుడు, జి.అవినాష్, ఎ.ప్రసాద్‌లను శుక్రవారం బ్యాంకు సిబ్బంది ఘనంగా సన్మానించారు. బ్యాంకు అభివృద్ధికి వారు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తులసీరావు, కృష్ణ, రాజు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు న్యాయఅవగాహనా సదస్సు

రాజాం సిటీ: స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో శనివారం న్యాయ అవగాహనా సదస్సు నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు చట్టాలపై, గుడ్‌టచ్– బ్యాడ్‌టచ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు.

రూ.13 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణం

రాజాం: పట్టణంలో గాంధీనగర్‌లో సీసీరోడ్డు నిర్మాణ పనులు శుక్రవారం చేపట్టారు. మున్సిపల్ అభివృద్ధి నిధులు రూ.13 లక్షలతో ఈ పనులు చేపట్టినట్లు ఏఈ పి.వెంకట్ వెల్లడించారు. మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు పనులను పరిశీలించారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న చీఫ్ విజిలెన్స్ అధికారి కరుణరాజు

సీతానగరం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలని విశాఖ స్టీల్‌ప్లాంట్ చీఫ్ విజిలెన్స్ అధికారి ఎస్. కరుణ రాజు కోరారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని పెదభోగిలి హడ్కోకాలనీలో విద్యుత్ కాంట్రాక్టర్ పి.రామారావు జ్ఞాపకార్థం కుమారుడు పి.నాగేశ్వరరావు నూతనంగా నిర్మించిన అంబేడ్కర్ విగ్రహాన్ని కరుణ రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాలకు రాజ్యాంగ పరంగా హక్కులు కల్పించిన మహనీయుని విగ్రహాన్ని నాగేశ్వరరావు నెలకొల్పడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో విశాఖ దళిత సంఘం ఐక్యవేదిక కన్వీనర్ ఎస్.వెంకటరావు, సర్పంచ్ జె.తేరేజమ్మ, పీఏసీఎస్ ఛైర్మన్ కూర్మారావు, ఆర్య వైశ్య సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.విశ్వేశ్వరరావు, ఏవీ సత్యనారాయణ, యు.సురేష్, చినభోగిలి మాజీ ఎంపీటీసీ ఎస్.వెంకయ్య, ఆదాల మోహనరావు, శాస్త్రి పలుగ్రామాల యువజన సేవాసంఘం నాయకులు పాల్గొన్నారు.

మాతృభాషపై మమకారం పెంచుకోవాలి

గుమ్మలక్ష్మీపురం: ప్రతి ఒక్కరూ మాతృభాషపై మమకారం కలిగి ఉండాలని గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య అన్నారు. ఉన్నత విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు కళాశాలలో ఈ నెల 23 నుంచి గిడుగు వెంకట రామమూర్తి జయంతి(తెలుగు భాషా దినోత్సవం) వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు తెలుగుభాష–సాహిత్యంపై అవగాహన కల్పించటంతో పాటు, పద్య పోటీలు నిర్వహించారు. తెలుగు భాషలోని స్పష్టత, నేర్పు, భావం, కూర్పు చాలా అందంగా ఉంటాయని, ఎందరో మహనీయులు, కవులు తెలుగు భాష ప్రాముఖ్యను చాటిచెప్పారని గుర్తుచేశారు. ప్రాశ్చ్యాత్య దేశాలు సైతం తెలుగు భాష గొప్పతనాన్ని కీర్తించాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు టి.త్రినాథ, శ్రీలక్ష్మి, శ్రీవాణి తదితరులు న్నారు.



ముఖ్యమంత్రి పర్యటనకు మెంటాడ వెవెళ్లేందుకు బస్సుటాప్‌పై ప్రయాణిస్తున్న ప్రజలు



ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు పొలం గట్ల నుంచి చినమేడపల్లి వద్ద పరుగులు తీస్తున్న ప్రజలు

● జగనన్నను చూసొద్దాం..!

కేంద్రియ గిరిజన విశ్వవిద్యాలయం శంకుస్థాపనకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని చూసేందుకు సాలూరు నియోజక వర్గ ప్రజలు ఉత్సాహంతో పరుగులు తీశారు.

– సాలూరు